

లక్ష ఉద్యోగాల ప్రకటనలతో రైల్వేశాఖ సిద్ధం

**దాదాపు లక్ష పోస్టుల భర్తీ. కోటి మందికిపైగా పోటీ. ప్రపంచంలోనే అతి పెద్ద నియామక ప్రక్రియగా భావిస్తున్న ఈ నోటిఫికేషన్‌లో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు కొన్ని మార్పులను ప్రకటించింది. గ్రూప్-సిలో అన్ని ఉద్యోగాలకు పదోతరగతి చాలంది. గరిష్ఠ వయసు పరిమితిని రెండేళ్లకు పెంచింది. దరఖాస్తు గడువు తేదీలను పొడిగించింది. ప్రయాణికుల భద్రతలో కీలకమైన ఈ ఉద్యోగాలకు సమర్థ సిబ్బందిని ఎంపిక చేసుకోడానికి తగిన ఏర్పాట్లు చేస్తోంది. చిన్న విద్యార్హతలతో కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో కుదురుకునే అరుదైన అవకాశం ఇది. ప్రశ్నపత్రం తీరుతెన్నులను మూలాల నుంచి అవగాహన చేసుకొని, తగిన ప్రణాళికతో సన్నద్ధమైతేనే పోటీని దాటి గమ్యం చేరుకోగలుగుతారు.**

# భారీ భర్తీలో పోటీ రద్దీ!

రైల్వే బడ్జెట్‌లో భద్రతకే తొలి ప్రాధాన్యం. రోజూ దేశం నలుమూలలకు ప్రయాణించే రెండున్నర కోట్లమంది ప్రయాణికుల భద్రతకు అన్ని రైళ్లలో సీసీ కెమెరాలు, రైలు భద్రత, ప్రమాద హెచ్చరిక వ్యవస్థతోపాటు 18 వేల కి.మీ. మేర రెండు, మూడు, నాలుగు లైన్లు కొత్తగా వేయడం, సిబ్బంది లేని దాదాపు నాలుగు వేల రైల్వే క్రాసింగ్ గేట్లను తొలగించడం, 12 వేల కొత్త వేగన్లు (సరకు రవాణాకు), 5 వేల కొత్త కోచ్‌లు, 700 నూతన రైలు ఇంజిన్లు రాబోవటం తదితర పరిణామాల నేపథ్యంలో రైల్వే శాఖకు పెద్దఎత్తున మానవ వనరులు అవసరమయ్యాయి. దీంతో ప్రపంచంలోనే అతి పెద్ద నియామక ప్రక్రియకు తెర తీశారు.



యస్.వి. సురేష్
ఎడిటర్, ఉద్యోగసోపానం

ఇప్పటికే ప్రకటించిన అసిస్టెంట్ లోకో పైలట్స్ (ఇంజిన్ సహాయక చోదకులు), టెక్నీషియన్స్ (సాంకేతిక సిబ్బంది); వివిధ విభాగాల్లో సహాయకులు (హెల్పర్స్) గ్రూప్-సి సిబ్బందికి వేరువేరు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. మరో 17 వేల ఖాళీల వరకు అసిస్టెంట్ సెక్షన్ ఇంజినీర్స్ నోటిఫికేషన్ కూడా త్వరలో వెలువడనుంది. ఇవన్నీ కలిపి సుమారు లక్ష పోస్టులవుతాయి.

## ఉద్యోగ విధులే ప్రశ్నపత్రానికి మూలం

ఉద్యోగం వేరూ, దాని ఎంపిక పరీక్ష వేరూ కాదు. చేసే ఉద్యోగ బాధ్యతల రీత్యానే సిలబస్ రూపకల్పన ఉంటుంది. కొందరు అభ్యర్థులు పరీక్ష పాసైతేనే కదా చేసే ఉద్యోగం గురించి తెలుసుకోవాల్సింది అనుకుంటారు. చురుకైన ఇంకొందరు ఉద్యోగ బాధ్యతలను ముందే తెలుసుకుంటారు. ఆ కోణం నుంచే సిలబస్‌ను వీక్షిస్తారు. దీని వల్ల పరీక్షకు సన్నద్ధత సులభతరం అవుతుంది. విజయావకాశాలు మెరుగవుతాయి. అందుకే రైల్వే శాఖ ప్రకటించిన పోస్టుల గురించి కొంతైనా తెలుసుకోవాలి.

- అసిస్టెంట్ లోకోపైలట్ ఉద్యోగం అంటే రైలు ఇంజిన్ చోదకుని (డ్రైవర్) కొలువు. తొలుత రైలు ఇంజిన్ డ్రైవర్‌కు సహాయకుడిగా విధులు నిర్వర్తించాలి. ఎంపికైన తరువాత వరంగల్ సమీపంలోని కాజీపేటలోనూ ఆపై హైదరాబాద్ సమీపంలోని మౌలాలిలో థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారు. ఆపై సరకు రవాణా చేసే గూడ్స్ ఇంజిన్‌పై అసిస్టెంట్ డ్రైవర్‌గా నియమిస్తారు. ఎప్పటికప్పుడు పనితీరును పరిశీలిస్తూ ప్రయాణికులను చేరవేసే రైలు, ఆపై సూపర్‌ఫాస్ట్ రైళ్లపై అవకాశం కల్పిస్తారు. దీనికి అనుగుణంగానే అసిస్టెంట్ లోకోపైలట్ నుంచి చీఫ్ లోకో పైలట్ వరకు అంచెలంచెలుగా ఎదగవచ్చు. అసిస్టెంట్ లోకోపైలట్‌గా చేరగానే ప్రారంభవేతనం, జీతభత్యాలు కలుపుకుని చేతికి రూ.40,000 వరకు అందుతుంది. రైలు ఇంజిన్ చోదకుడిగా సిగ్నలింగ్ వ్యవస్థను అర్థం చేసుకోవడం, దానిని అప్రమత్తంగా అనుసరిస్తుండటం, రైలు వేగ నియంత్రణ.. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ రైలును సురక్షితంగా గమ్యానికి చేర్చడమే ఈ ఉద్యోగి ప్రధాన విధి.
- గ్రూప్-సి ఉద్యోగాలన్నింటినీ సహాయకులు (హెల్పర్స్) అని పేర్కొంటూ వారు ఏయే విభాగాల్లో పనిచేయాలో నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఉదాహరణకు- పాయింట్‌మన్ అన్న పోస్టుకి ఎంపికైతే స్టేషన్‌లో రైలు బయలుదేరడానికి ముందు చక్రాల స్థితి, రెండు కోచ్‌ల మధ్య అనుసంధానం పరీక్షించి ఆపై ప్లాట్‌ఫారంపై నిలబడి పచ్చజెండా ఊపడం వీరి విధి. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తే పదోన్నతులు పొందుతూ అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ వరకు ఎదగవచ్చు. ఇందుకు శాఖాపరమైన పరీక్షలు రాయాల్సి ఉంటుంది. గ్రూప్-సిలో అన్ని పోస్టులకు మూల వేతనం రూ.18,000.

మరో ఉద్యోగం ట్రాక్‌మన్. పేరులోనే సూచిస్తున్నట్లు ఒక్కో ఉద్యోగికి 6 కి.మీ. మేర రైలు పట్టాల పర్యవేక్షణ బాధ్యత ఇస్తారు. పాతిక కిలోల టూల్‌కిట్ బ్యాగ్‌తోసహా రైలు పట్టాల వెంట పరిశీలిస్తూ ఏదైనా అవాంతరం గుర్తిస్తే చీఫ్ పర్మనెంట్ వే ఇన్‌స్పెక్టర్‌కు తక్షణం సమాచారం ఇవ్వాలి. ఇలా ట్రాక్ మెయింటనర్ ఉద్యోగంలో చేరి పనితీరు, అంతర్గత పరీక్షలు రాసుకుంటూ జూనియర్ ఇంజినీర్ (పర్మినెంట్ వే ఇన్‌స్పెక్టర్) స్థాయి వరకూ చేరుకోవచ్చు. ప్రారంభ వేతనం రూ.20,000. ఇలా వీటితోపాటు ప్రకటించిన పోస్టులు హెల్పర్ ఎలక్ట్రికల్, మెకానికల్, టెలికాం, సిగ్నలింగ్ విభాగాల్లో సహాయక విధులు నిర్వర్తించాలి. పోస్టులన్నింటికీ పదోన్నతులు, వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలు సమానంగానే ఉంటాయి. గ్రూప్-సిలోని పోస్టులను పరిశీలిస్తే దాదాపు అన్ని మెకానికల్, ఎలక్ట్రికల్ సంబంధితమై ఉండటం గమనార్హం. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుంటే పరీక్ష సన్నద్ధతకు ఇదే మార్గదర్శి అవుతుంది.

## సిలబస్ విశ్లేషణ

ఉద్యోగ బాధ్యతల కోణం నుంచి ఎంపిక ప్రక్రియ, సిలబస్‌లను పరిశీలిస్తే ప్రశ్నపత్ర మూలాలను తెలుసుకోవచ్చు. ఉద్యోగి విధులను సమర్థంగా నిర్వహించగలిగే ప్రతిభను పరీక్షించే విధంగా ఆయా కేటగిరీ పోస్టులకు తగిన ఎంపిక ప్రక్రియను రైల్వే సిద్ధం చేసింది.

అసిస్టెంట్ లోకోపైలట్ పోస్టుకు మూడు దశల ఎంపిక ఉంటుంది. వాటిలో మొదటి రెండు దశలు రాతపరీక్షలే. సిలబస్ దాదాపుగా ఒక్కటే. రెండో దశలో కఠినత్వ స్థాయి ఎక్కువ. మూడో దశ పూర్తిగా మానసిక స్థాయిని పరీక్షించే పరీక్ష.

గ్రూప్-సి పోస్టులకు కేవలం రాతపరీక్ష ఒక దశలోనే ముగుస్తుంది. అయితే ఈ పోస్టులకు ఎంపికయ్యేవారు చేయాల్సిన విధుల రీత్యా ట్రాక్‌మన్ అయితే పది, పన్నెండు కి.మీ. 'కిట్'తోసహా నడవాలి. కాబట్టి శారీరక దార్ఢ్య పరీక్షను తుదిదశగా నిర్వహిస్తారు. రాతపరీక్షలో నెగ్గినవారే ఈ పరీక్షలో పాల్గొంటారు.

## నాలుగు అంశాలు

అసిస్టెంట్ లోకోపైలట్ లేదా గ్రూప్-సి రాతపరీక్షలో ప్రధానంగా నాలుగు అంశాలు పరిశీలిస్తారు. అవి: 1) జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్ 2) మేథమేటిక్స్ 3) జనరల్ సైన్స్ 4) జనరల్ అవేర్‌నెస్

ఆర్‌ఆర్‌బీ పాత ప్రశ్నపత్రాల్లోని కొన్ని ప్రశ్నలను చూసి అభ్యర్థులు లోకోపైలట్ లేదా గ్రూప్-సిని తేలికగా తీసుకుంటే మాత్రం ఈసారి చిక్కుల్లో పడతారు. ఎందుకంటే ఆర్‌ఆర్‌బీ గ్రూప్-సి వంటి పాపులర్ కేటగిరీ నియామకాలు జరిపి మూడు, నాలుగేళ్లైంది. ఈ మధ్యకాలంలో నియామక సంస్థల విధానాల్లో మార్పులు వచ్చాయి. మునుపు దరఖాస్తు చేసినవారిలో ఎక్కువ ప్రతిభ చూపినవారిని ఎంపిక చేసుకోవాలన్న దృక్పథంతో ప్రశ్నపత్రాలుండేవి. అయితే ఇటీవలి కాలంలో ఉద్యోగ బాధ్యతలకు న్యాయం చేయగలిగే తెలివిగల వారికోసం అన్వేషణ జరుగుతోంది. ఇందుకోసం ప్రశ్నపత్రాలతోనే వడగట్టేస్తున్నారు. సమర్థులను ఎంచుకోడానికి దీన్ని ఒక ప్రయోగవేదికలా వినియోగించుకుంటున్నారు.

మేథమేటిక్స్, జనరల్ ఇంటెలిజెన్స్ ద్వారా అభ్యర్థిలోని ఆలోచనల వేగం, కచ్చితత్వం, వేగంగా స్పందించే స్వభావం, విషయాలను సాధారణీకరించే ఊహాశక్తి తదితర గుణాలను వివిధ సమస్యల రూపంలో పరిశీలించే అవకాశం ఉంది. ఉదాహరణకు-

- '9 2 5 8 1 4 7 3' ఈ అంకెలను ఆరోహణ క్రమంలో రాస్తే వచ్చే అమరికలోని కుడివైపు నుంచి నాలుగో అంకె, ఎడమవైపు నుంచి మూడో అంకెల మధ్య తేడా ఎంత?

  1) 1 2) 2 3) 3 4) 4 **జవాబు: 2**

ఈ ప్రశ్నకు తగిన సమయం తీసుకుని ఎవరైనా సమాధానం గుర్తించవచ్చు. కానీ అత్యంత వేగంగా ఆలోచించి జవాబును గుర్తించగలగడం సమయ నిర్వహణలో కీలకం. ఇలాగే గ్రూప్-సి గత పరీక్షలో గణిత విభాగంలో అడిగిన ప్రశ్న.

- $10.01 \times 100.001 \div 1001 = ?$

  1) 1.00001 2) 10.001
  3) 100.001 4) 1000.01 **జవాబు: 1**

గుణిస్తూ జవాబు రాబట్టడం ఏ అభ్యర్థి అయినా చేయగలుగుతాడు. కానీ ఇటువంటి సమస్యలకు వేగంగా జవాబు గుర్తించడం ద్వారానే ఇచ్చిన వ్యవధిలో గరిష్ఠంగా జవాబులు రాయవచ్చు. ఈ ప్రశ్నలు ఉద్యోగార్థిలో ఆలోచనల వేగాన్ని సూచిస్తాయి. లోకోపైలట్ లేదా గ్రూప్-సి ఉద్యోగ బాధ్యతల్లో వేగంగా ఆలోచించడం, తగిన నిర్ణయం త్వరితగతిన తీసుకోవడం అలవాటుగా ఉన్న అభ్యర్థులు రాణించగలుగుతారు.

## సన్నద్ధత ఎలా?

ఆర్‌ఆర్‌బీ నిర్వహించే గ్రూప్-సి, అసిస్టెంట్ లోకోపైలట్ పరీక్షల్లో... జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, మేథమేటిక్స్ విభాగాల్లో ఎక్కువ ప్రశ్నలు; జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో కనీసం 15 శాతం ప్రశ్నలు అభ్యర్థుల ఆలోచనల వేగాన్ని, తగిన నిర్ణయం తీసుకోగలిగిన సామర్థ్యాన్ని పరీక్షించేవిగా ఉండి జయాపజయాలను నిర్దేశిస్తున్నాయి. సన్నద్ధత సమయంలోనే ఈ తరహా అంశాలకు ప్రాధాన్యమిస్తూ చదవాలి.

జనరల్ సైన్స్‌ను సాధారణంగా గతంలో ఆర్‌ఆర్‌బీ పరీక్షల్లో జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా అడిగేవారు. అయితే అసిస్టెంట్ లోకోపైలట్, గ్రూప్-సి ఉద్యోగ బాధ్యతల్లో శాస్త్ర సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాల్సిన అవసరం రీత్యా ఈ విభాగాన్ని ప్రత్యేకంగా సిలబస్‌లో ఇస్తున్నారు.

రైలు ఇంజిన్‌లో డ్రైవరుగా పనిచేసే అభ్యర్థి లేదా రైలు ట్రాక్‌ను పర్యవేక్షించే అభ్యర్థికి భౌతికశాస్త్రంలోని ధ్వని, కాంతి, విద్యుత్, అయస్కాంతత్వం తదితర అంశాలు, రసాయన, జీవశాస్త్రాలపై అవగాహనతో వృత్తిలో రాణించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విభాగంలో ప్రశ్నలు ఉండనున్నాయి.

జనరల్ సైన్స్‌లో భౌతిక, రసాయన శాస్త్రాల్లో అనువర్తన అంశాలకు సన్నద్ధతలో ప్రాధాన్యం ఇవ్వాలి. ఉదాహరణకు- చలించే వాహనం, ప్రవహించే నీటిలో గతిశక్తి, నడిచే వాహనానికి బ్రేకులు వేస్తే ఒకవైపునకు ఎందుకు వంగుతుంది? అయస్కాంతం ఇనుప వస్తువులనే ఎందుకు ఆకర్షిస్తుంది? రబ్బరు పట్టీలో ఇమిడి ఉన్న భౌతికశాస్త్ర సూత్రం. విమానాల్లో వాడే భూమ్యాకర్షణ సాధనం, వజ్రాలు ఎందుకు మెరుస్తాయి? వంటి అనువర్తన శాస్త్ర అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రాథమిక అంశాలతోపాటు అనువర్తన విషయాలపై దృష్టి పెట్టడం వల్ల పోటీలో ముందుండే అవకాశముంది.

జనరల్ అవేర్‌నెస్‌ను ఈసారి సిలబస్‌లో పొందుపరిచేటపుడు చిన్న మార్పు చేశారు. 'వర్తమానాంశాలపై సాధారణ అవగాహన' (జనరల్ అవేర్‌నెస్ ఆన్ కరెంట్ అఫైర్స్) అని పేర్కొన్నారు. ఇదే సమయంలో వర్తమానాంశాల్లో రాజకీయ పరిణామాలు, ఆర్థికశాస్త్ర- సాంకేతిక రంగాలు, క్రీడారంగం, వార్తల్లో వ్యక్తులు.. అంశాలను పేర్కొన్నారు. ఈ రంగాల్లో పరీక్షకు ఆరు నెలల ముందు పరిణామాలను పరిశీలించాలి.

రెండు కేటగిరీల రాతపరీక్షలు ఏప్రిల్, మే నెలల్లో జరిగే అవకాశముందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు గడువు పొడిగించినందువల్ల దేశంలోని భారీ నియామక ప్రక్రియలో అత్యధికమంది పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో నిర్వహణ సుదీర్ఘమై మరింత సమయం లభించవచ్చు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక ప్రకారం తగిన కృషి చేస్తే విజయం మీదే!





## తగ్గిన విద్యార్హత- పెరిగిన గడువు

అరవై రెండు వేలకు పైగా ఖాళీలు ఉన్న గ్రూప్-సి పోస్టులకు గత నోటిఫికేషన్ వరకూ కనీస విద్యార్హత పదోతరగతే. అయితే తాజా నోటిఫికేషన్‌లో పదోతరగతితోపాటు ఐటీఐ లేదా పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ సాంకేతిక విద్యార్హతను జత చేశారు. ఇంతకుముందు వరకు ఎటువంటి సూచన లేకుండా హఠాత్తుగా ఈ పోస్టులను సాంకేతిక విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడంతో దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. దీంతో ఈసారికి గ్రూప్-సి పోస్టులన్నింటికీ పదోతరగతిని అర్హతగా నిర్ణయించారు. సాంకేతిక విద్యార్హతలు లేకపోయినా అవకాశం కల్పిస్తున్నట్లు స్వయంగా రైల్వే మంత్రే ప్రకటించారు. ఇదే సమయంలో అన్ని వర్గాల వారికి గరిష్ఠ వయసు పరిమితిని మరో రెండేళ్లు పెంచారు. అలాగే రిజర్వేషన్ సౌకర్యంలేని సాధారణ అభ్యర్థులకు పరీక్ష ఫీజు రూ.500గా ప్రకటించడంపట్ల నిరసన వ్యక్తమవటంతో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు రూ.400 తిరిగి చెల్లిస్తామని కూడా ప్రకటించారు. ఇలా ప్రధానమైన మూడు మార్పులు జరగడంతో సవరణ నోటిఫికేషన్ జారీ చేసి అసిస్టెంట్ లోకోపైలట్లు, గ్రూప్-సి పోస్టులకు దరఖాస్తు గడువులను మార్చి 31 వరకు పెంచారు.

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**పుణె కంటోన్మెంట్ బోర్డులో 77 ఖాళీలు**

భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన పుణె కంటోన్మెంట్ బోర్డు టీచర్, జూనియర్ క్లర్క్ తదితర పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.
**అర్హత:** పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీఈడీ, ఎంబీబీఎస్, ఇతర అర్హతలు. **వయసు:** 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ద్వారా.
**దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరితేది:** 07.04.2018
http://punecantonmentboard.org/jobdate.html

**ఎన్ఐడబ్ల్యూఈ, చెన్నై**

**సంస్థ:** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ (ఎన్ఐడబ్ల్యూఈ), చెన్నై **పోస్టులు:** ప్రాజెక్ట్ ఇంజినీర్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ తదితరాలు. **ఖాళీలు:** 16 **అర్హత, వయసు:** నిబంధనల ప్రకారం. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ **చివరితేది:** 28.03.2018 **వెబ్‌సైట్:** http://niwe.res.in/

**ఈఎస్ఐసీ, సనత్‌నగర్ మెడికల్ కాలేజ్**

**సంస్థ:** ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) వైద్య కళాశాల, ఆసుపత్రి, సనత్‌నగర్, హైదరాబాద్
**పోస్టులు:** జూనియర్ రెసిడెంట్, సీనియర్ రెసిడెంట్, ట్యూటర్ **ఖాళీలు:** 52. **ఇంటర్వ్యూ తేదీలు:** 2018 మార్చి 20 నుంచి ఏప్రిల్ 9 వరకు **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 16.03.2018 **వెబ్‌సైట్:** www.esic.nic.in

### వాక్ ఇన్ ఇంటర్వ్యూ

**ఎన్‌సీఏఓఆర్, గోవా**

**సంస్థ:** నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రిసెర్చ్ (ఎన్‌సీఏఓఆర్), వాస్కోడగామా, గోవా.
**పోస్టులు:** ఇంజినీర్, ప్రాజెక్ట్ టెక్నికల్ అసిస్టెంట్ తదితరాలు.
**ఖాళీలు:** 05 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్, బీఎస్సీ లేదా మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమా.
**వయసు:** 40 ఏళ్లకు మించకూడదు.
**ఇంటర్వ్యూ తేది:** 26.03.2018
**వేదిక:** నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రిసెర్చ్, వాస్కోడగామా, గోవా.
**వెబ్‌సైట్:** www.ncaor.gov.in

**నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ పొమగ్రనేట్**

**పోస్టులు:** ఎస్ఆర్ఎఫ్, యంగ్ ప్రొఫెషనల్ **ఖాళీలు:** 08
**అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, సర్టిఫికెట్ కోర్సుల ఉత్తీర్ణత, అనుభవం.
**వయసు:** 21-45 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఇంటర్వ్యూ తేది:** 05.04.2018
**వేదిక:** ఐకార్-నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఆన్ పొమగ్రనేట్, షోలాపూర్, మహారాష్ట్ర.
http://nrcpomegranate.icar.gov.in

**ఎన్ఆర్‌సీబీ, తిరుచిరాపల్లి**

**పోస్టులు:** యంగ్ ప్రొఫెషనల్-01, టెక్నికల్ అసిస్టెంట్-01. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బీఎస్సీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత. **వయసు:** 21-45 ఏళ్ల మధ్య ఉండాలి.
**ఇంటర్వ్యూ తేది:** 12.03.2018
**వేదిక:** నేషనల్ రిసెర్చ్ సెంటర్ ఫర్ బనానా (ఎన్ఆర్‌సీబీ), తిరుచిరాపల్లి, తమిళనాడు.
**వెబ్‌సైట్:** http://nrcb.res.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**

## ఒకేషనల్ కోర్సు తర్వాత..?

>>> ఇంటర్ (క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ ఇన్ అగ్రికల్చర్) ఒకేషనల్ కోర్సు చేశాను. నాకున్న ఉన్నత విద్య అవకాశాలను తెలపండి. నాకున్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలేవి?

*- నక్కల శ్రీనివాస్ యాదవ్*

**జ:** క్రాప్ ప్రొడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్ పూర్తిచేసినవారికి స్వయం ఉపాధి, వ్యవసాయ, వ్యవసాయాధారిత పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఇది స్టాండ్ అలోన్ కోర్సు కావడం వల్ల వ్యవసాయం ద్వారా వ్యవసాయాధారిత మార్గాల ద్వారా స్వయం ఉపాధి కల్పనకు విద్యార్థులను తయారు చేస్తోంది. ఈ కోర్సు పూర్తిచేసినవారికి విలేజ్ లెవల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, విత్తన గ్రేడర్, విత్తన ప్రొడక్షన్ అసిస్టెంట్, మెటరలాజికల్ అబ్జర్వర్, గ్రామీణ బ్యాంకుల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, సీడ్ గ్రోవర్ వంటి శాఖల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగావకాశాలుంటాయి. ఇంకా పై చదువుల విషయానికొస్తే బీబీఏ, బీబీఎం వంటి డిగ్రీ కోర్సులను చేసి పీజీ స్థాయిలో ఎంబీఏ (అగ్రి బిజినెస్) కోర్సును చేసే సౌలభ్యం ఉంది. మనదేశం వ్యవసాయాధారిత దేశం కాబట్టి వ్యవసాయ సంబంధిత మేనేజ్‌మెంట్ కోర్సులు చేసినవారికి మంచి అవకాశాలున్నాయి.



## బీటెక్ కాకుండా... ఏం చదవొచ్చు?

>>> ఈసీఈ డిప్లొమా చేశాను. నా సబ్ బ్రాంచ్ ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజినీరింగ్. ఉన్నతవిద్య చదవాలనుంది. బీటెక్ కాకుండా నాకున్న అవకాశాలేంటి?

*- విశాల్*



**జ:** సాధారణంగా డిప్లొమా పూర్తి చేసినవారు ఉద్యోగం కానీ బీటెక్ ద్వారా తమ చదువును కానీ కొనసాగిస్తారు. మీకు బీటెక్ కాకుండా బీఎస్సీ (కమ్యూనికేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్, మేథమేటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) చదివే అవకాశం ఉంది. అలాకాకుండా వ్యాపారం, మేనేజ్‌మెంట్ పట్ల ఆసక్తి ఉంటే బీబీఏ, బీకాం, బీబీఎం వంటి డిగ్రీ కోర్సులను ఎంచుకోవచ్చు. ఈ మధ్యకాలంలో కొన్ని కళాశాలలు డిగ్రీ స్థాయిలో డేటా అనలిటిక్స్ కోర్సులను అందిస్తున్నాయి. మీ అభిరుచి, ఆసక్తి ఆధారంగా పైన పేర్కొన్న కోర్సులను ఎంచుకోవచ్చు.

● *ప్రొ. బి. రాజశేఖర్,* కెరియర్ కౌన్సెలర్